
సాక్షి
పల్నాడు

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



45.61 టీఎంసీలు నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,928 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టులో 45.61 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 7713 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు కెనాల్‌కు 750 క్యూసెక్కులు వదిలారు.

లక్ష్మీనరసింహునికి పూజలు



బెల్లంకొండ: మండలంలోని కేతవరంలో ఉన్న రాజ్యలక్ష్మీ సమేత వజ్ర లక్ష్మీనరసింహుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సీ ఓబులేసును నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె. రాజ్యలక్ష్మిని రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాలని కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. తాజా బదిలీల్లో భాగంగా కమిషనర్ ఆఫ్ మున్సిపల్ ఆడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) విభాగంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఓబులేసును గుంటూరు అదనపు కమిషనర్‌గా నియమించారు.

నేడు జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందికి కౌన్సెలింగ్

గుంటూరు వెస్ట్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియకు శనివారం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి జెడ్పీ ఆవరణలోని ఆ శాఖ డీఐజీ కార్యాలయంలో ఈ ప్రక్రియ జరగనుంది. సుమారు 70 మంది సబ్ రిజిస్ట్రార్లు, 80 మంది సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గుంటూరు, ఒంగోలు, నెల్లూరు జిల్లాల డీఐజీ స్థాయి అధికారులతో దీనికోసం కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా గుంటూరు జిల్లా డీఐజీ జి.శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. డిమాండ్ ఉన్న పోస్టులకు ప్రజాప్రతినిధుల నుంచి కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం తమకు అందిన మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు నిర్వహిస్తామని చెబుతున్నారు.

రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్ కైవసం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గుంటూరు అమరావతిలోని ఆర్‌సీటీ అదనపు రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్, విజయవాడలోని ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ కె.సంపత్‌కుమార్‌లు ఆల్ ఇండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్ వెటరన్స్ విభాగంలో టైటిల్ కైవసం చేసుకున్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలోని ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీలో జరిగిన 70వ ఆల్ ఇండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో దేశ వ్యాప్తంగా పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన డబుల్స్ ఫైనల్‌లో శ్రీనివాసరావు, మునీర్‌లపై రాజేంద్రప్రసాద్, సంపత్‌కుమార్‌లు విజయం సాధించారు. వారిని పలువురు అభినందించారు.

యర్రబాలెంలో భారీ వర్షం

ఓ ఇంటిపై పడిన పిడుగు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై పిడుగు పడింది. సేకరించిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. యర్రబాలెంలో నివాసం ఉంటున్న సాలి బంగారయ్య అనే వ్యక్తి నివాసంపై పిడుగు పడింది. బిల్డింగ్‌పై ఒక వైపు పిట్టగోడతోపాటు స్వల్పంగా శ్లాబ్ , గోడలు బీటలు వారాయి. ఇంట్లో విద్యుత్ తీగలు మొత్తం పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మాణం



యద్దనపూడి: మండలంలోని గన్నవరం–యనమదల దండు దారి సమీపంలో రూ.2.80 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకట మురళి, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు నివారించి రైతులకు, గృహ అవసరాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని 10 గ్రామాలకు పైగా లోవోల్టేజీ సమస్య తీరుతుందని చెప్పారు. అనంతరం యనమదలలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్రబాబు, విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, డీఈ నల్లూరి మస్తాన్‌రావు, ఈఈ శ్రీనివాసరావు, ఏడీ సురేంద్రబాబు, ఏఈ సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఆందోళన బాట



సమస్యల పరిష్కారం కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ మమతప్రియ, డాక్టర్ కె.వి.కోటేశ్వరరావు, డాక్టర్ అంకమ్మబాయిలు మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్‌లు నల్ల రిబ్బన్లు నోటికి కట్టుకొని తమ నిరసన వ్యక్తపరిచారు. -నరసరావుపేటటౌన్



జీఓ నంబరు 115ను రద్దుచేయాలని కోరుతూ కొన్నిరోజులుగా ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ నర్సులు చేస్తున్న ఆందోళనలో భాగంగా శనివారం రాత్రి పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ హాస్పిటల్ నర్సులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, నర్సింగ్ ప్రమాణాలను కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. -నరసరావుపేట

హోరాహోరీగా క్రీడా పోటీలు

- ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఆటలపోటీలు ప్రారంభం
- నందిగామ, నార్నెపాడుల్లో మండల స్థాయి పోటీలు
- రెండు చోట్ల 620 మంది బాలబాలికలు హాజరు
- తొలి రోజు నాలుగు విభాగాల్లో నిర్వహణ
- ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక



నందిగామలో జరుగుతున్న వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు సత్తెనపల్లి మండలం నందిగామ, ముప్పాళ్ల మండలం నార్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాలలో శనివారం హోరాహోరీగా సాగాయి. ముందుగా ప్రజాప్రతినిధులు జాతీయ జెండా ఆవిష్కరించారు. క్రీడాకారులు మార్చిఫాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. అండర్–14, అండర్–17 పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 620 మంది బాలబాలికలు హాజరయ్యారు. తొలి రోజు బాలబాలికలకు అండర్–14, అండర్–17లో వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఆటల పోటీలు జరిగాయి. మండల, జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో గతంలో పాల్గొన్న వారితోపాటు కొత్త వారు తమ ప్రతిభను ప్రదర్శించారు. నందిగామలో క్రీడా ఎంపికలు ఎస్‌జీఎఫ్ మండల కో–ఆర్డినేటర్ లాకు పిచ్చియ్య నేతృత్వంలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి నియోజకవర్గస్థాయి పోటీలకు పంపనున్నారు. నాలుగు క్రీడలకు సంబంధించి ఒక్కో మండలంలో అండర్ –14 బాలబాలికలు 8 జట్లు, అండర్–17 బాల,బాలికలు 8 జట్లు చొప్పున రెండు మండలాల్లో 32 జట్లను ఎంపిక చేశారు. ఈనెల 21న బాలబాలికలకు అథ్లెటిక్స్, చెస్, యోగా నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో నందిగామ



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, ఆళ్ల అమరేశ్వరావు, ఆళ్ల సాంబయ్య, సత్తెనపల్లి మండల విద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, ఏ.రాఘవేంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు కాకరపర్తి శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ డీ.అనిల్ దత్త నాయక్, పీడీలు శ్రీరామిరెడ్డి, శశికళ, కాకుమాను సునీత, చండీప్రియ, తులసి రామ్‌నాయక్, షేక్ మీరా, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారుల అభిప్రాయాలు ఇలా..

వాలీబాల్‌లో సత్తా చాటుతా



నేను సత్తెనపల్లి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్నా. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా ఎంపికల్లో అండర్–17 బాలికల విభాగంలో వాలీబాల్ నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటడమే లక్ష్యం.

–ఎస్.సింధూర, క్రీడాకారిణి, సత్తెనపల్లి

గెలుపే లక్ష్యంగా తలపడతా



నేను 9వ తరగతి చదువుతున్నా. సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన నేను కబడ్డీ పోటీలపై దృష్టి సారించా. ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీల్లో నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యా. ఇక్కడ రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొందడమే లక్ష్యంగా పోటీల్లో తలపడతా.

–షేక్ నజీర్‌బాషా, క్రీడాకారుడు, నందిగామ

ఖోఖో పోటీల్లో రాణిస్తా



నేను సత్తెనపల్లి మహాత్మా జ్యోతిభాపూలే బీసీ బాలికల వసతి గృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి విద్యనభ్యసిస్తున్నా. నేను ఆరో తరగతి నుంచి ఆటలపై దృష్టి సారించా. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి నియోజకవర్గం ఖోఖో పోటీలకు ఎంపికయ్యా. ఎస్‌జీఎఫ్ జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతగా రాణించాలని ఆశిస్తున్నా.

–కె.ప్రశాంతి, క్రీడాకారిణి, సత్తెనపల్లి

చట్టాలపై అవగాహన ఉంటేనే బాధితులకు న్యాయం

జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు

నరసరావుపేట: చట్టాలపై పూర్తి అవగాహన ఉంటేనే కోర్టుల ద్వారా బాధితులకు న్యాయం చేయగలుగుతామని, నేరస్తులకు శిక్షలు పడతాయని జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక రాధాకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించిన న్యాయ నిపుణులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి న్యాయ సహకార సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై పలు విషయాలు వివరించారు. పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లకు నూతన చట్టాలలో చేయవలసిన, చేయకూడని వివిధ పనుల గురించి అవగాహన కల్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది కేసు రిజిస్టర్ చేసిన తరువాత, చార్జిషీట్ వేసే సమయంలో కోర్టులో ఎదురవుతున్న సమస్యలు, వాటిని ఎలా అధిగమించి కోర్టులో నడుచుకోవాలో అడిగి తెలుసుకున్నారు.



ప్రాసిక్యూషన్ డీడీ మధుసూదనరావుకు మెమెంటో అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 39 మంది పీపీలు, ఏపీపీలు పాల్గొన్నారు. మధుసూదనరావుకు జిల్లా ఎస్పీ మెమెంటో అందజేసి సత్కరించారు. స్థానిక ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి, సత్తెనపల్లి ఏపీపీ బగ్గి నరసింహారావు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు మాట్లాడగా, పలు ప్రాంతాలకు చెందిన పీపీలు, ఏపీపీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ శ్రేణుల దాడి

గురజాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం...మండల పరిధిలోని తేలుకుట్ల గ్రామానికి చెందిన చల్లా నాగరాజు వైఎస్సార్ సీపీలో ఎన్నికల సమయంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఎన్నికలు పూర్తయిన నాటి నుంచి చల్లా నాగరాజు గ్రామంలో నివాసం ఉండకుండా పులిపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం తేలుకుట్ల గ్రామంలో పని నిమిత్తం వచ్చి రాత్రి సమయంలో తిరిగి పులిపాడు వెళ్తుండగా గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద నాగరాజును టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని పక్కనే ఉన్న చెట్లలోకి తీసుకువెళ్లి గొడ్డళ్లు, రాళ్లు, కర్రలతో దాడి చేశారు. దాడిలో నాగరాజు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బంధువులు నాగరాజును గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

పాతకక్షల నేపథ్యంలోనే...

పాతకక్షల నేపథ్యంలో వారి మధ్య శుక్రవారం వాగ్వాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఇరువురి కుటుంబాల మధ్య గత కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలోనే శుక్రవారం జరిగిన సంఘటనకు కారణమన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏదైనా జరిగితే వెంటనే సమాచారమివ్వండి

విద్యాసంస్థల యాజమాన్యాలకు గుంటూరు జిల్లా ఎస్పీ సూచన

నగరంపాలెం: ప్రైయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఏదైనా జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. నగరంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యజమానులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లోని హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత ప్రతి ఒక్కరితో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని వారు తెలిపారు. మైనర్ల డ్రైవింగ్, ఈవ్ టీజింగ్, వాహనాలు నడిపే మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ వంటి అంశాలపై చర్యలకు జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందించారు. గంజాయికి బానిసైన కొందరు యువత ప్రభావం విద్యార్థులపై పడుతోందని, దీనిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పారు. ఏదైనా ఘటన జరిగితే



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

స్థానిక పోలీస్ అధికారులకు, 100 లేదా 86888 31568కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్) బి.సీతారామయ్య (ఎస్బీ), సీఐ శ్రీనివాసరావు (ఎస్బీ), వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఏపీపీఎస్ఏ, ఏపీయూఎస్ఎంఏ నాయకులు కన్న మాస్టర్, మేకల రవీంద్రబాబు, గణేష్ కాటూరి, వెంకటేశ్వరరావు, మంజుల, మస్తానరావు, నాయుడు చక్రనాగ్, మున్ను రాజేష్, మల్లికార్జునరావు, బత్తిన వెంకటరావు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు కరిముల్లా, లక్ష్మణ్, హుస్సేన్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- రెండు కార్యక్రమాల పోస్టర్లు ఆవిష్కరణ

నరసరావుపేట: నీతి ఆయోగ్ సహకారంతో రూపొందించిన స్వర్ణాంధ్ర–2047 విజన్ ముసాయిదా నివేదికను వెబ్‌సైట్‌కు అనుగుణంగా రాబోయే ఐదేళ్లలో జిల్లా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా, మండల స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పన చేసే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈనెల 21 నుంచి అక్టోబర్ ఐదు వరకు ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో విజన్ ముసాయిదా డాక్యుమెంట్ ప్రదర్శిస్తారని, దీనిపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు తెలుసుకుని మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను ఈ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలని, జిల్లా, మండల స్థాయి అంశాలను పొందుపరుస్తూ అక్టోబర్ 15 నాటికి జిల్లా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. నిర్దేశిత సమయాలలో పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తల సమావేశాలను ఏర్పాటుచేసి సూచనలు, సలహాలు సేకరించాలన్నారు. ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం , రైతులు, ప్రముఖులు, ఇతర సంఘాలతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

24 నుంచి పొలం పిలుస్తోంది

ఈనెల 24 నుంచి జిల్లాలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కార్యక్రమం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖల



కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

అధికారులు, ఉద్యాన, పశువైద్య, విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలతో కలిసి ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ రైతులకు అవసరమైన విజ్ఞానం, నైపుణ్యాలు, నూతన పద్ధతులు, సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించి నాణ్యమైన పంటల ఉత్పత్తులు, నిల్వపై అవగాహన కల్పిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి

నరసరావుపేట: త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కింద హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన సదస్సులో భాగంగా మన ఇల్లు–మన గౌరవం అనే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్ పరిధిలో పేదలకు ఇల్లు కట్టించడంపై అధికారులు 100 శాతం ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి స్టేజీలో వార్డు అమినిటీ సెక్రటరీలు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ స్థాయిలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని, ఎంపీడీవోలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సహకారం అందించాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించాలని, లబ్ధిదారులతో మాట్లాడాలని ఇళ్లతోపాటు మరుగుదొడ్లను కూడా గ్రౌండ్ చేసి నిర్మాణం చేపట్టాలన్నారు. వందరోజుల లక్ష్యం కింద జిల్లాకు 7707 కేటాయించగా, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై అర్బన్, పీఎంఏవై గ్రామీణ్‌లో భాగంగా మొదలుకాని ఇళ్ల నిర్మాణాలను వెంటనే మొదలు పెట్టాలని, సంబంధిత మండల, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలని, నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి కొళాయి పనులు వేగవంతం చేయండి

నరసరావుపేట: అమృత పథకం ద్వారా మున్సిపాలిటీల్లో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మొదటి విడతలో మంజూరైన రూ.180 కోట్ల పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులలో ఇబ్బందుల్ని పరిష్కరించాలన్నారు. రెండవ విడతకు సంబంధించి రూ.258 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఇప్పటివరకూ పథకం ద్వారా మంజూరైన పనులను పూర్తి చేయగలిగితే ఎనిమిది మున్సిపాలిటీల్లోని దాదాపు 60వేల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు అందించవచ్చన్నారు. ప్రజారోగ్యశాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

నరసరావుపేట: జిల్లాలో కబేళాలకు అక్రమంగా గోవుల రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గోవుల అక్రమ రవాణా, నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు, రవాణా సిబ్బందితో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తామన్నారు. హైవేలు, పశువుల సంతల వద్ద నిరంతరం పర్యవేక్షణ ఉండేలా గస్తీ నిర్వహిస్తామన్నారు. నిబంధనల ప్రకారం వెటర్నరీ డాక్టర్లు ధ్రువీకరించిన గోవులను పర్మిట్ ఉన్న వాహనాలలో పరిమిత సంఖ్యలో మాత్రమే కబేళాలకు తరలించాల్సి ఉంటుందన్నారు. మున్సిపాలిటీల్లో సంతల నిర్వహణ కమిటీల ద్వారా చట్టప్రకారం పశువధ, రవాణా చేయడంపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రధాన రహదారుల్లో తనిఖీలు చేపడతామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి ఆర్డీవోలు సరోజిని, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ, డీటీసీ టి.పరంధామరెడ్డి, పశు సంవర్ధక శాఖ జేడీ కాంతారావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఖజానా ఉద్యోగులపై వేటు

ఎస్టీవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్

చీరాలటౌన్: తమకు కాసులు వచ్చే సీట్లు దక్కలేదని ఖజానా ఉద్యోగులు పెన్‌డౌన్ చేయడంతో పాటుగా బిల్లుల్ని పాస్ చేయకపోవడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖజానా ఉద్యోగుల తీరు, పెండింగ్ బిల్లులపై 'సాక్షి' విపులంగా కథనాన్ని ప్రచురించింది. జిల్లా కలెక్టర్ వెంకట మురళి స్పందించారు. చీరాల ఎస్టీవో భాగ్యలక్ష్మిని, సూపరింటెండెంట్ సుధీరలను సస్పెండ్ చేశారు. ఇద్దరు ఉద్యోగులను నెల్లూరు జిల్లాకు, ఒకరిని గిద్దలూరు ట్రెజరీ కార్యాలయానికి, ఒకరిని కనిగిరి ఎస్టీవో కార్యాలయానికి బదిలీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్

క్లుప్తంగా

ఏసీఏ మ్యాచ్‌కు వర్షం దెబ్బ

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. మ్యాచ్‌లో భాగంగా శనివారం సెంట్రల్ జోన్, నార్త్ జోన్ మధ్య ప్రారంభమైన మ్యాచ్ తొలిరోజు ఆట మూడు ఓవర్లకే పరిమితమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ బ్యాటింగ్‌కు దిగి మూడు ఓవర్లలో ఆరు పరుగులు చేసింది. ఈ సమయంలో వర్షం రావటంతో అంపైర్లు తొలిరోజు ఆటను నిలిపివేశారు. ఆదివారం రెండవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ముగిసిన ఔత్సాహిక వ్యాపార శిక్షణ



నరసరావుపేట ఈస్ట్: నూతనంగా వ్యాపారం ప్రారంభించే నిరుద్యోగ యువతకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా ఉంటుందని జిల్లా అధికారి కె.సంజీవరావు స్పష్టం చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఐదు రోజులుగా వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ముగింపు సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రుణాలు పొందటంలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. బ్యాంకు రుణాలు, కావలసిన ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ రాయితీ తదితర అంశాలను తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎం.బాలకృష్ణరాజు, హేమాద్రి, కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి

సత్తెనపల్లి: పాతకక్షల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... కొమెరపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన ముస్లిం వర్గాలు మేడికొండూరు మండలం రాయల గ్రామంలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లారు. అక్కడ ఇరువర్గాల మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. అక్కడి నుంచి తిరిగి కొమెరపూడి గ్రామానికి చేరుకున్న అనంతరం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మందులపాలెం నూరుల్లా, మందులపాలెం మహబూబ్ సుభాని, మందులపాలెం బుడాతో పాటు మరికొందరిపై టీడీపీకి చెందిన మధిర నజీర్, మధిర సుభాని, మరికొందరు దాడికి పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఏడుగురికి, టీడీపీకి చెందిన ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

17 మందిపై కేసులు నమోదు

పాతకక్షల నేపథ్యంలో సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో 17 మందిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కొమెరపూడి గ్రామానికి చెందిన మహమ్మద్ నూరు హుస్సేన్ ఫిర్యాదు మేరకు మందులపాలెం షేక్ మహమ్మద్ మీరాతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. మందులపాలెం షేక్ మహమ్మద్ మీరా ఫిర్యాదు మేరకు మధిర జాన్ సైదాతోపాటు మరో ఏడుగురిపై సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ కృపారత్నం కేసు నమోదు చేశారు.

సత్తా చాటిన కృష్ణా జిల్లా గిత్తలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వర రావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న బండలాగుడు పోటీల్లో కృష్ణా జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. శనివారం సబ్ జూనియర్స్ విభాగంలో గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, తెలంగాణ నుంచి పది జతలు పాల్గొన్నాయి. వీటిలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన అక్కినేని సత్యచౌదరి గిత్తలు 4,500 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన నల్లూరి కృష్ణయ్య గిత్తలు 3,900 అడుగులు లాగి ద్వితీయ స్థానాన్ని, పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్ చౌదరి గిత్తలు 3757.2 అడుగులు లాగి తృతీయ స్థానం, నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రమణ్యేశ్వర రెడ్డి గిత్తలు 3631.4 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు స్థానిక శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు.



పోటీల్లో బండలాగుతున్న గిత్తలు

24న రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 రెజ్లింగ్ జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫెడరేషన్ కార్యదర్శి గుంటూరు నరసింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాల, మోడరన్ పెంటాథ్లాన్ ఎంపికలు గోరంట్లలోని నెక్స్‌జెన్ పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. 28న త్రోబాల్ ఎంపికలు బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, చిలకలూరిపేటలోని ఏఎంజీ స్కూల్లో బాస్కెట్‌బాల్, బాక్సింగ్ ఎంపికలు ఉంటాయని వివరించారు. 2006 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకంతో హాజరు కావాలని సూచించారు.

పొన్నూరులో 40.8 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 40.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కాకుమాను మండలంలో 3 మి.మీ. పడింది. జిల్లా సగటున 7 మి.మీ.గా నమోదైంది. సెప్టెంబర్ 21వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 101.7 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 235.1 మి.మీ.గా నమోదైంది.

ఘనంగా గురజాడ జయంతి

నరసరావుపేటఈస్ట్: చాందస భావాలతో కొట్టుమిట్టాడుతున్న సమాజాన్ని చైతన్యపరిచి ఆధునికత వైపు నడిపిన యుగకర్త గురజాడ అప్పారావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మహాత్మా జ్యోతిభాపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో గురజాడ 162వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వై.త్యాగరాజు తదితరులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు సేవలను కొనియాడారు. తెలుగు భాషకు వెలుగులు దిద్దుతూ గురజాడ రచనలు సమాజాన్ని చైతన్య పరిచాయని తెలిపారు. స్త్రీ స్వేచ్ఛ కోసం సంఘ సంస్కరణ ఉద్యమాన్ని నడిపారని వివరించారు. పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి రాగయుక్తంగా గురజాడ గేయాలను ఆలపించి ఆకట్టుకున్నారు. విద్యార్థులకు గురజాడపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆంధ్ర చైతన్య గ్రూప్ ప్రతినిధి షేక్ బాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.రత్నప్రభ, ఉపాధ్యాయులు పి.వెంకటరెడ్డి, ఎం.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ పరిషత్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

మా భూమికి రక్షణ కల్పించండి

- టీడీపీ నాయకుడు బెదిరిస్తున్నాడు
- పోలీసులను ఆశ్రయించిన కుటుంబం

వినుకొండ(నూజెండ్ల): మా భూమికి రక్షణ కల్పించండి, టీడీపీ నాయకుడు తమ భూమిని ఆక్రమించి తమను బెదిరిస్తున్నాడంటూ వినుకొండకు చెందిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిని అక్రమంగా కొందరు ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని అదేమని ప్రశ్నిస్తే దాడులు చేసేందుకు సిద్ధమయ్యారని పట్టణానికి చెందిన వ్యాపార వేత్త అవ్వారు శంకరరావు కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఉన్న 80 సెంట్ల స్థలం 1946 నుంచి తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిందని, అందులో 44 సెంట్ల భూమిని 2021లో ముండ్లమూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు మందడం వెంకట్రావుకి విక్రయించామని, అయితే ఆ స్థలంలోని ఒకటిన్నర సెంటు భూమిలో తమ పూర్వీకుల సమాధులు ఉన్నాయని, ఆ స్థలం కూడా కబ్జా చేసి ఆక్రమించుకునేందుకు వెంకట్రావు అనుచరులు తమ మేనేజర్‌పై దాడికి యత్నించారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రంగారావు, వెంకట్రావు, శివప్రసాద్, మహేశ్వరరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న శంకరరావు కుటుంబసభ్యులు

ఆట్యా-పాట్యా చాంపియన్ రోహిత్ జోయల్‌కు కలెక్టర్ అభినందన

నరసరావుపేట: భూటాన్ దేశంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన ఎనిమిదో దక్షిణ ఆసియా ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో మన దేశం తరఫున పాల్గొని ప్రథమ స్థానం పొందిన ఉన్నం రోహిత్ జోయల్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో తాను సాధించిన కప్‌తో జోయల్ జిల్లా కలెక్టర్‌ను కలిశారు. భూటాన్ దేశంలో నిర్వహించిన చాంపియన్ పోటీలకు జిల్లాలోని నరసరావుపేటకు చెందిన రోహిత్ దేశం తరఫున పాల్గొనగా, లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న సీనియర్ పీడీ ఝాన్సీరాణి కుమారుడు కావటం మరో విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతీ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియచేయగా, ఏపీ ఆట్యా-పాట్యా అసోసియేషన్ సీఈవో రంభా దుర్గాప్రసాదు, సెక్రటరీ రంభా శ్రీచరణ్, అధ్యక్షులు చావేజ్, కోచ్ పుల్లయ్య అభినందనలు తెలిపారు.



సాధించిన కప్‌తో రోహిత్ జోయల్



కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రోహిత్ జోయల్‌ను అభినందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

విద్యార్థుల పాలిట కల్పవృక్షం కౌండిన్య ఐఏఎస్ అకాడమీ

శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు

పెదకాకాని: అతి తక్కువ ఫీజులతో భోజన వసతి కల్పిస్తూ పోటీ పరీక్షల్లో అత్యున్నత శిక్షణ అందిస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులకు కల్పవృక్షంగా మారిందని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ బ్యాంకింగ్ పరీక్ష కోసం నిర్వహించిన శిక్షణలో మొదటి బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సభకు శనివారం ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. అకాడమీ వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, ఎల్‌ఐసీ, బ్యాంకింగ్ రంగాలలో ఉద్యోగాలకు ఉత్తమ శిక్షణ ఇవ్వడంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆదర్శనీయంగా ఉందన్నారు. విద్యార్థులు నిరంతరం పట్టుదలతో ఇష్టపడి చదివి పోటీ పరీక్షలలో విజయం సాధించాలన్నారు. అకాడమీ అందిస్తున్న కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఈవీ నారాయణ 20 ఏళ్ల క్రితమే కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. రూ.2.25 కోట్ల మూలధనాన్ని సమకూర్చి ఇప్పటి వరకు ప్రతిభ గల పేద విద్యార్థులకు రూ.రెండు కోట్ల మేరకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం రూ.7 కోట్ల విరాళాలు సేకరించి కౌండిన్య ఐఏఎస్ అకాడమీని గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు అకుంఠిత దీక్షతో అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ ప్రసంగిస్తూ.. ప్రతిభ గల పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రూ.50 లక్షలతో డాక్టర్ ఈవీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా పేద విద్యార్థులకు నైపుణ్యాలను అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కేఎస్ లక్ష్మణరావు రచించిన 'సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రతులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు వాకా రామ్‌గోపాల్‌గౌడ్, చిలక చంద్రమౌళి, బెల్లంకొండ సదాశివగౌడ్, పామర్తి సాంబశివరావు, వీరంగి రంగారావు, వేముల శేషాచలం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ తాతా సాంబశివరావు, వడ్డెంగుంట సుబ్బారావు, బొబ్బిళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కోచింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులతో నిర్వాహకులు